# పాపాయి యిల్లు

ఊరికి దూరంగావుంది ఆ గుడిసె. విపరీతమైన వర్షం. విపరీతమైన గాలి. గాలికి చెట్లు కూలుతున్నై, ఉరుములు ఉరుముతున్నై, మెరుపులు మెరుస్తున్నై.

ఆ గుడిసెలో తాత విచారంగా కూర్చుని వున్నాడు. ఉరుములు ఉరిమినప్పుడల్లా ఉలిక్కి పడుతున్నాడు. మెరుపులు మెరిసినప్పుడల్లా కళ్ళుమూసుకుంటున్నాడు. పాపమాత్రం కాళ్ళ సందున నిలబడి సంగి సంగి మాటలు చెబుతూవుంది—

"అతూ ఇతూ వెల్తా నంతు ది. ఎప్పాలూ తిలుగుతుంది. పక్కవాళ్ళింతికి వెల్తుంది. ఎదులు వాళ్ళింతికి వెల్తుంది. ఎదులు వాళ్ళగేత్లో వేలుపెత్తి కోతు కుంతుంది."

తాతకు భయంవేసింది. నెమ్మదిగా పాప తల నిమురుతూ "ఎవరమ్మా?" అన్నాడు.

"పాప" అంది పాప.

"ఎవరి పాప?"

"మా పాపే"

గాలి ఎక్కువయింది. పసిపిల్లలు వందమంది కలిసి ఏడుస్తూ వున్నట్లుగా వినిపిస్తూంది. ఫెళఫెళామని గర్జించినై ఉరుములు. తాతకు భయం ఎక్కువయింది. పాపని దగ్గరకు తీసుకున్నాడు. మెరుపులకాంతిలో పాపని తనివితీరా చూట్టానికి ప్రయత్నించాడు. పాపమాత్రం మాట్లాడుతూనే వుంది—.

"మా పాప మంచిది. గిన్నెలు పగలగొత్తదు. ఎత్తుకోమని ఏలవదు. ఎప్పాలూ ఆలుకుంతుంది—"

ధన్ ధన్ ధన్మని బయటమోత. తాతగుండెలు అవిసినై. వొణికిపోయాడు. ఆ గాలి, ఆ వర్షం, ఆ ఉరుములు, ఆ మెరుపులు అన్నీ ఏకమై తనమీదకు దండెత్తుతున్నై. ఏం చెయ్యటానికి? తాతగుండె బేజారయింది.

పాప మాత్రం యధాప్రకారం మాట్లాడుతూనే వుంది. మాట్లాడుతూ, మాట్లాడుతూ అగస్మాత్తుగా, "తాతా, మా ఇంటి కొత్తవా?" అంది.

తాత గుండె గుభేలుమన్నది. పాప తల నిమురుతూవున్న చెయ్యి వొణికింది. కళ్ళవెంట నీళ్ళుకారాయి — "అమ్మా, అమ్మా, నీ ఇల్లెక్కడమ్మా?" అని అడిగాడు.

"అక్క లుంది" అని కిటికీవైపుకు చూపింది.

తాత ఇక మాట్లాడలేకపోయాడు. ఆలోచనలు చెలరేగినై. ఆకాశంవైపుకి చూశాడు. ఒక నిట్టూర్పు విడిచాడు. పాప మాత్రం మాట్లాడుతూనే వుంది.

"మాఇంట్లో నాన్నున్నాలు. అమ్మోంది. మందుంది. మందు మా పాప చక్కా తాగుతుంది_"

వెంటనే తాత కొక కోర్కె కలిగింది. పాప నడిగాడు.

"తాతున్నాడా?"

"లేలు-తాత ముసలాలు." అని జవాబు చెప్పింది పాప.

తాత ఇక మాట్లాడొద్దనుకున్నాడు. మునగదీసుకొని, కుంచుక్కుంచు కూర్చున్నాడు. పాప మాత్రం యధాప్రకారం మాట్లాడుతూనే వుంది.

"మా ఇంట్లో అన్నీ వున్నై. మా పాపే అన్నంతిన్నని గోల చేస్తుంది. బళ్ళో కెళ్ళదు. పలక కావాలంటుంది. 'అన్నం వొద్దే'

అని పిలుస్తుంది. కొనుక్కుంతానికి చిన్న కానీ ఇమ్మంటుంది.. మా ఇంట్లో లైట్లు కూలావున్నై."

గాలికి కిటికీ తలుపులు టపాటపా కొట్టుకొని, వందమంది పసిపిల్లల ఏడుపునీ ముంచివేసింది. చలిగాలి లోపలికి జంయిన కొట్టింది. కోడిపిల్లని రెక్కకిందకు తీసుకున్నట్లు, తాత పాపని శాలువాలోకి తీసుకున్నాడు. పాప బుల్లి చేత్తో తాత మొహం తవుడుతూ అడిగింది.

"తాతా, కాదూ ?"

"ఏమిటి తల్లీ ?"

"పాప ఇల్లు మంచిది కాదూ ?"

"మంచిదే తల్లీ"

"నువ్వు మంచిదానవు కావూ ?"

తాత మాట్లాడలేకపోయాడు. గొంతులో మాటలు గొంతులోనే గురగురమన్నై. అవయవాలు బిగిసిపోతున్నై. పాప మాత్రం మాట్లాడుతూనే వుంది.

"పాప ఇంట్లో మంచాలున్నాయి తాతా! నే పలుకుంతాను నిద్రపోతాను."

తాతకి గాలివానమోత వినపడలేదు. గాలివాన సంగతే క్షణం మరచిపోయాడు. అంతా పాపే - పాపే -! పాపని హృదయానికి హత్తుకున్నాడు. పాప తలమీద కన్నీటిబొట్లు రాలిస్తే చాలు.

పాప ఉన్నట్లుండి అడిగింది, "నే వెళ్ళనా తాతా ?"

తాత అలాగే వుండిపోయాడు. శరీరం కొయ్యబారినట్లు అయిపోయింది. బయటవందమంది పసిపిల్లల ఏడ్పులు ఎక్కు-

వైనై. గుడిసె కదిలిపోయింది. చీకటి మడ్డి కట్టింది.

తాత అడిగాడు, "ఎక్కడికి తల్లీ ?"

"మా ఇంతికి."

"నేనూ వస్తానమ్మా"

"వొద్దు. వాళ్ళే, నిన్ను చూచి నవ్వుతాలు - నవ్వుతాలు తాత !"

"ఎందుకని తల్లీ ?" పగిలిన తాత హృదయంలోనుంచి ఉరుములా బయటపడిందీ ప్రశ్న-

"ఎందుకని తల్లీ !"

"ఎందుకని తల్లీ ! !"

"ఎందుకని తల్లీ ! ! !"

పాప జవాబు చెప్పలేదు. బయట మెరుపులు మెరిసినై. ఉరుములు ఉరిమినై. చెట్లు ఫెళ ఫెళా విరిగినై. ధనధనా కూలినై గుడిసె అటువూగి ఇటువూగి ఫటఫటా కూలింది.

అంతలో నిశ్శబ్దం. అంతలో మోత. తాత తెప్పరిల్లి, లేచి చూచేటప్పటికి పాపదగ్గర్లేదు. తాతగుండెలు పేలిపోయినై. చలి సంబంధం లేకుండానే కాళ్ళు గజగజ లాడినై. హృదయంలో, వూడి కుప్పగా పడుతున్న మరమేకుల మోత!

"పాపా, పాపా!" అని, ఆ చీకటిని చేత్తో వెతుకుతూ కేకలు పెట్టాడు.

"పాపా, పాపా!"

గాలివాన మోతేమోత!

"పాపా, పాపా!"

వందా ఒక్క పసిపిల్లల ఏడుపుల ధ్వనే ధ్వని!!